# కాంగ్రెసోళ్లను నమ్మితే ఆగమే..

- మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట
- తూర్పు నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి నిధులు కేటాయించా
- మరోసారి భారీ మెజార్టీ అందించాలి
- ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- బీఆర్ఎస్‌కు ఆటో యూనియన్ నాయకుల సంపూర్ణ మద్దతు



గిర్మాజీపేట: గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నరేందర్

గిర్మాజీపేట, నవంబర్ 7: తెలంగాణ ప్రశాంతంగా ఉండాలంటే అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించాలని, కాంగ్రెసోళ్లను నమ్మి ఓటువేస్తే రాష్ట్రం ఆగం అవుతుందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీషా శ్రీమాన్ ఆధ్వర్యంలో మంగళవారం నోబుల్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం నాయకులు ఏర్పాటు చేసిన గ్యార్మీ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మైనార్టీల అభివృద్ధికి అన్నివిధాలా సహకరించి షాదీముబారక్, మైనార్టీబంధు పథకాలు అందజేస్తున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలకులు అధికార దాహంతో తహతహలాడుతూ.. అడ్డదారుల్లో అధికారంలోకి రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని ఆగం చేస్తారని, తెలంగాణ అభివృద్ధిలో వెనుకబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మైనార్టీలపై ప్రేమతో అత్యధిక నిధులు కేటాయించి షాదీఖాన, మసీదు, జెండాగద్దెలు, దర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలుపుతానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి, ప్రజా సంక్షేమ సర్కారును ఆశీర్వదించాలని కోరారు. అలాగే, రామ సురేందర్ ఆటో యూనియన్ నాయుడు పంపు అడ్డా నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు వారంతా శివనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నన్నపునేనిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వాగ్దానం చేశారు. సుమారు 70 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతరం ఉర్సుగుట్ట దీపావళి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నరేందర్‌ను కలిసి నరకాసురవధకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అభివృద్ధి చేసే వ్యక్తిని ఎన్నుకోవాలి

ఖిలావరంగల్: తూర్పు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని బీఆర్ఎస్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్ ప్రజలను కోరారు. శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నన్నపునేనికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను గందరగోళానికి గురి చేసి అభివృద్ధి చేయకుండా ఆగం చేసే చీడపురుగుల్లాంటి నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఒక పేద బిడ్డకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే కలెక్టరేట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇన్నర్ రింగ్‌రోడ్, బస్‌స్టేషన్, రోడ్లు, డ్రైనేజీలు, 24 అంతస్తుల హాస్పిటల్, బస్తీ దవాఖాన, అండర్ గ్రౌండ్ డక్ట్, బండ్ అభివృద్ధి.. ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు పుకార్లు, షికార్లు చేసినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదని విమర్శించారు. మైనార్టీలంతా ఏకమై తనకు మద్దతుగా సమావేశాలు ఏర్పాటు చేసి ఆశీర్వదిస్తున్నారన్నారు. జక్కలొద్దిలో తనపై పూర్తి నమ్మకంతో ఎనిమిది వేల మంది తనకు మద్దతు తెలిపి బీఆర్ఎస్‌లో చేరారన్నారు. ఇప్పుడు వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కరోనా సమయంలో ఒకరు ఫాంహౌస్‌లో, మరొకరు పౌల్ట్రీఫాంలో ఉన్నారే తప్ప ప్రజల బాగోగులు చూడలేదని ఎద్దేవా చేశారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్‌కు తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు రుణ విమోచన చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు, డీలర్లు పాల్గొన్నారు. అలాగే, 34వ డివిజన్‌లో నన్నపునేని సమక్షంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలెపాక రాజు బీఆర్ఎస్‌లో చేరాడు. అలాగే, వరప్రసాద్, రఘు, రవితోపాటు సుమారు 60 కుటుంబాలు పార్టీలో చేరాయి. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీలతతోపాటు 30 మందిని పార్టీలోకి ఆహ్వానించారు. ఇందిర, మోహిని తదితరులు పాల్గొన్నారు.

## నన్నపునేనికి ఎంఎంనగర్ మద్దతు

### రూ.100 బాండ్ పేపర్‌పై ఏకగ్రీవ తీర్మానం

ఖిలావరంగల్, నవంబర్ 7: బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు స్వచ్ఛంద సంస్థలు, పరపతి సంఘాలు, కుల సంఘాలు ముందుకొస్తున్నాయి. ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేస్తున్నాయి. గ్రేటర్ వరంగల్ 37వ డివిజన్‌లోని ఎంఎంనగర్‌లో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఎంఎంనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేసిన నరేందరన్నకే మా ఓటు' అని స్థానికులు ప్రకటించారు. అనంతరం రూ. 100 బాండ్ పేపర్‌పై ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేశారు. 'ఎంఎంనగర్ నరేందరన్న అడ్డా.. ఇతర పార్టీలు ప్రచారానికి రావొద్దు' అని బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంఎంనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులు, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, జీవో 58, 59 ద్వారా పట్టాలు అందజేసిన ఘనత ఎమ్మెల్యే నరేందర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బోగి సురేశ్, డివిజన్ అధ్యక్షుడు సంగరబోయిన విజయ్, కాలనీ అధ్యక్షుడు ఎండీ ఉల్ఫత్, ఏలియా, రబ్బాని, సతీశ్, రంజిత్, గౌస్, రవి, సాంబరాజు, సంతోష్, జగన్, అరుణ, శ్రీనివాస్, జ్యోతి, సంధ్య, ఉమ, రాజు, రమేశ్, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ సువర్ణ సమక్షంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఎంనగర్ వాసులు



గిర్మాజీపేట: ఫ్లెక్సీ వద్ద కారు గుర్తుకే మా ఓటు అంటూ నినాదాలు చేస్తున్న ఎన్‌టీఆర్ కాలనీ వాసులు

## ఎన్టీఆర్‌నగర్ కాలనీ నన్నపునేని అడ్డా..!

### ఇతర పార్టీలకు ప్రవేశం లేదని ఫ్లెక్సీ ప్రదర్శన

గిర్మాజీపేట, నవంబర్ 7: 'ప్రజా సంక్షేమ బీఆర్ఎస్ ప్రభుత్వానికే మా పూర్తి మద్దతు.. ఎన్‌టీఆర్‌నగర్ కాలనీ ఎమ్మెల్యే నరేందర్ అడ్డా... బీఆర్ఎస్ గడ్డ... ఈ కాలనీలోకి ఏ ఇతర పార్టీల వారికీ ప్రవేశం లేదు' అంటూ 28వ డివిజన్ హంటర్‌రోడ్‌లో ఉన్న ఎన్‌టీఆర్‌నగర్ కాలనీ ఎంట్రన్స్ వద్ద కాలనీవాసులు మంగళవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు వచ్చి కష్టకాలంలో తమకు అండగా నిలిచి, తమ బాధలను పంచుకొని అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే నరేందర్ వెంటే మేమంతా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కాలనీలో 70 కుటుంబాలు నివసిస్తున్నామని, మొత్తం 283 ఓట్లు ఉన్నాయని.. మేమంతా కారు గుర్తుకే ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.

## 14 నుంచి కార్తీక మాసోత్సవాలు

పోచమ్మమైదాన్, నవంబర్ 7: వరంగల్ శ్రీనివాసకాలనీలోని శృంగేరి శంకరమఠంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 11 వరకు కార్తీక మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు సంగమేశ్వరజోషి తెలిపారు. ఈ మాసాంతం ప్రతిరోజు రుద్రాభిషేకం, ప్రతి సోమవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 27న కార్తీక పౌర్ణమి సందర్భంగా రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం, డిసెంబర్ 4న కార్తీకదీపం, కోటి దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## '10లోగా ఫారం 12 అందజేయాలి'

హనుమకొండ, నవంబర్ 7: తెలంగాణ రాష్ట్ర శాసనసభ 2023 ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోలింగ్ అధికారులు(పీవోలు), సహాయక పోలింగ్ అధికారులు(ఏపీవోలు), ఇతర పోలింగ్ (ఓపీవోలు) అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం-12 నింపి తాము పని చేస్తున్న మండల సహాయ అధికారి, తహసీల్దార్లకు ఈ నెల పదో తేదీలోగా అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం-12 వెంట ఎన్నికల విధుల ఉత్తర్వుల కాపి, ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డును విధిగా జతచేసి, పోస్టల్ బ్యాలెట్ పంపేందుకు సరైన అడ్రస్ రాసి అందజేయాలని సూచించారు. ఫారం-12ను ఓటర్ నంబర్ ఆధారంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారికి కార్యాలయంలోని పెసిలిటేషన్ సెంటర్‌లో ఎలక్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోస్టర్ బ్యాలెట్ నోడల్ అధికారి వద్ద ఉంచుతారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు పెసిలిటేషన్ సెంటర్‌లోనే వేయాలన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలు, తేదీలను త్వరలోనే తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

### వరంగల్ ఏసీపీ బోనాల కిషన్



పోచమ్మమైదాన్, నవంబర్ 7: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలందరూ నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ హెచ్చరించారు. ప్రజలు రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో ఎలాంటి అనుమతి లేకుండా ఐదుగురు, అంతకుమించి గుమికూడొద్దన్నారు. అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారాలు చేసేందుకు, ప్రచార రథాలు తిప్పుకోవడానికి విధిగా రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని, ప్రైవేట్ శుభకార్యాలు, బర్త్‌డే పార్టీలు, ఆత్మీయ సమ్మేళనాలు, కుల భోజనాలు, వన భోజనాలు ఇతర కార్యక్రమాలకు వెళ్లేటప్పుడు పార్టీల జెండాలు, కండువాలు ధరించొద్దన్నారు. ఓట్లు అభ్యర్థించొద్దని, ఓటర్లను ప్రభావితం చేయొద్దని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భాల్లో నిర్వాహకులు, అభ్యర్థులపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఎన్నికల ప్రచారం చేయొద్దని, అభ్యర్థులు ఆలయాలు, చర్చిలు, మసీదులు, ప్రార్థనా మందిరాలు, మతపరమైన కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయొద్దన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారానికి ఉపయోగిస్తే అభ్యర్థులు, ఫంక్షన్ హాల్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని, అలాగే ఎన్నికల టోల్‌ఫ్రీ నంబర్ 1950, పోలీసుల టోల్‌ఫ్రీ నంబర్ 100కు డయల్ చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఏసీపీ స్పష్టం చేశారు.

## విద్యార్థులకు అన్నదానం

పోచమ్మమైదాన్, నవంబర్ 7: వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో మంగళవారం అన్నదానం చేశారు. యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన తిక్క రంజిత్‌కుమార్-తిక్క కోమలత దంపతుల కుమార్తె వర్ష పుట్టిన రోజు వేడుకలను అంధుల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కుటుంబ సభ్యులు

## బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు మరోసారి దరఖాస్తుల ఆహ్వానం

### నేటి నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో అవకాశం

వరంగల్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు మరోసారి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ నిబంధనల మేరకు బీఎస్సీ నర్సింగ్ సీట్లను ఎంసెట్ ఆధారంగా చేపడుతూ యూనివర్సిటీ అధికారులు ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ చేపట్టారు. ఇటీవల ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఉన్న ఎంసెట్ క్వాలిఫైయింగ్ పర్సంటైల్ ప్రమాణాలను ఈ ఏడాది సడలించింది. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి ఎంసెట్‌కు హాజరైన అభ్యర్థులను చేర్చుకోవడం ద్వారా ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఐఎన్‌సీకి ఎలాంటి అభ్యంతరం లేదని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ సడలింపు ఈ సంవత్సరం ప్రవేశాలకు మాత్రమేనని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. దీంతో కాళోజీ యూనివర్సిటీ దరఖాస్తులకు మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రకటన జారీ చేశారు. ఎంసెట్‌కు హాజరైన అభ్యర్థులు ఈ నెల 8 ఉదయం 8 గంటల నుంచి 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.knruhs.gov.in.httpsలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

### బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా వెంకట్రాములు



పోచమ్మమైదాన్, నవంబర్ 7: భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా వరంగల్‌కు చెందిన తాటిపాముల వెంకట్రాములు ఎన్నికయ్యారు. బీహార్ రాజధాని పాట్నాలో ఇటీవల జరిగిన జాతీయ 15వ జాతీయ మహాసభలో బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యులుగా నాలుగోసారి ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.